www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 డిసెంబర్ 2022
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ఉద్యోగులు 'అవుట్' సోర్సు లేదు..!

"రావాలి జగన్..కావాలి జగన్" అనుకున్నారు...జగన్ వస్తే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఫర్మినెంట్ చేస్తారని ఆనందపడ్డారు.. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తూ ఆయా కార్యాలయాలకు ఆయువు పట్టుగా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే తొలగించాలని ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. ఇటీవల ఆప్కాస్‌లో చేర్చి, కొద్దిగా జీతాలు పెంపుదల చేశారు. త్వరలో రెగ్యులర్ చేస్తారని సంబరంలో ఉన్న ఉద్యోగులకు పిడుగులాంటి వార్త. జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సుమారు 6,598 మంది వరకు పనిచేస్తున్నారు. ఇందులో 4 వేల మంది వరకు పదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు ఉన్నట్లు సమాచారం. 10 ఏళ్లలోపు సిబ్బందిని ఎలాంటి కారణాలు లేకుండా తక్షణం ఇంటికి పంపాలని ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయా కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయి.

- ◆ప్రభుత్వ జిఒతో చిరుద్యోగుల ఆవేదన
- ◆రెగ్యులర్ ఉద్యోగులతో సమాన పని
- ◆దుర్మాగపు ఉత్తర్వులు : ఉద్యోగులు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తున్నారు. ఇటీవల పిఆర్‌సి కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై అనేక రకాల ఆంక్షలు పెడుతున్నారు. ఏదో ఒక కారణం చూపి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇప్పుడు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై పడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉద్యోగ విరమణ తర్వాత ఆ పోస్టులు భర్తీ చేయడం లేదు. ఖాళీగా ఉన్న స్థానాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. కేవలం రూ 15 వేలు చెల్లించి ఫర్మినెంట్ ఉద్యోగుల కన్నా ఎక్కువ చాకిరీ చేయించుకుంటున్నారు. డిగ్రీలు, పిజిలు చేసిన నిరుద్యోగులు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు దొరక్క అవుట్ సోర్సింగ్‌లో చిన్న చిన్న ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. ఈ చిన్నపాటి ఉద్యోగాలతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. కలెక్టరేట్, రెవెన్యూ, అటవీశాఖ, పోలీసుశాఖతోపాటు దాదాపు అన్ని శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారు. ఇటీవల రెవెన్యూ వంటి శాఖల్లో ఉద్యోగ విమరణ చేసిన తహశీర్దులు, ఇతర ఉన్నతాధికారులను అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లోనే నియమిస్తున్నారు. గతంలో కాంగ్రెస్, టిడిపి కాలం నుంచి ఈ పద్ధతి కొనసాగుతోంది. దీనికి ఎలాంటి గుర్తింపు లేదు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాదయాత్రల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక చోట్ల విజ్ఞప్తి చేసిన మీదట తాను అధికారంలోకి వస్తే రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారు. జగన్ సిఎం అయినప్పటి నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఏడాది కిందట జిల్లాలోని అత్యధికుల మందిని అప్కాస్‌లో చేర్చారు. దీనికి కలెక్టర్‌ను ఛైర్మన్‌గా పెట్టి భవిష్యత్‌లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఉద్యోగుల పోరాట ఫలితంగా ఇటీవల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచారు. రూ 15 వేల నుంచి రూ 23 వేల వరకు జీతాలు అందుతున్నాయి. తమను ఎప్పటికైనా రెగ్యులర్ చేస్తారని ఉద్యోగులు ఎంతో ఆశగా ఉన్నారు. ఇతర పనులు వచ్చినా వదిలేసి జగన్ తమను పర్మినెంట్ చేస్తారని ఇక్కడే ఉండిపోయారు. ఇటీవల గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రోబేషన్ ఇచ్చారు. వలంటీర్లు, 20 వేల మంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు మరో 10 వేల మందిని నియమించారు. ప్రయివేటు రంగంలోనూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అవకాశం కల్పిస్తామని చెప్పారు.

4 వేల మంది ఇంటికి..

ప్రభుత్వ శాఖల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పదేళ్ల లోపు సర్వీసు ఉన్న ఉద్యోగులను తక్షణమే ఇంటికి పంపాలని నవంబర్ 28న ప్రభుత్వం మెమో విడుదల చేసింది. వెంటనే హమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో సుమారు 6598 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. ఇందులో సుమారు 4వేల మంది వరకు పదేళ్లలోపు సర్వీసు ఉంది. ఈ నిర్ణయంతో అందరూ ఇంటికి వెళ్లే ప్రమాదం ఉంది. జూనియన్ అసిస్టెంట్, టైపిస్టులు, వాచ్‌మెన్, డేటా ఎంట్రీ అపరేటర్లు వంటి ఉద్యోగులను తొలగిం చనున్నారు. మున్సిపాలిటీలోనూ ఎక్కువ మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఎక్కువ పనిచేస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగుల వలే కష్టపడుతున్నారు. జగన్ అధికా రంలోకి వచ్చాక ఎక్కువ మందికి ఉద్యోగాలిచ్చారు. జగన్ తమను రెగ్యులర్ చేస్తారని ఆనందపడుతోన్న సమయలో ఇలాంటి నిర్ణయం ఆందోళన కలిగిస్తోంది. మోమోను తక్షణ ఉపసంహరించుకోవాలని ఉద్యోగులు కోరుతన్నారు. కార్మిక సంఘాలు ఆందోళనకు దిగుతున్నారు.

ఓటర్ల సంఖ్యను గణనీయంగా పెంచాలి

కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టి ఓటర్ల సంఖ్యను గణనీయంగా పెంచాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు.ఆదివారం నగరంలోని ముత్తుకూరు రోడ్డు సెంటర్ సమీపంలోని జలవనరుల శాఖ కార్యాలయం, వి ఆర్ లా కళాశాల లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం లో భాగంగా ఓటర్ క్లెయిముల వివరాలను సంబంధిత బి ఎల్ ఓ లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండబోతున్న ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయవలసి ఉందన్నారు.జిల్లాలో జనాభాకు తగ్గట్టుగా ఓటర్ల నిష్పత్తి (ఈపి రేషియో) లేదని, తక్కువ ఉందని, అలాగే స్త్రీ పురుష ఓటర్ల లింగ నిష్పత్తి కూడా చాలా తేడా ఉందని దీన్ని అధిగమించేందు కోసం పెద్ద ఎత్తున ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ముఖ్యంగా 18-19, 20-29 సంవత్సరాల వయసు వారిని ముమ్మరంగా ఓటర్లుగా చేర్పించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 50 క్లెయిమ్లు వచ్చేలాగా తీవ్రంగా కషి చేయాలన్నారు. ఇందుకోసం జగనన్న విద్యా దీవెన పథకం కింద లబ్ధి పొందుతున్న విద్యార్థుల వివరాలను తీసుకొని వారిలో ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి వెంటనే చేర్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ కార్డుకు తో ఆధార్ కార్డు నెంబరు అనుసంధానం కూడా నెల్లూరు లో 60 శాతం పూర్తయిందని మిగిలిన కార్డులను కూడా పూర్తిగా అనుసంధానం చేయాలని సూచించారు. ఇందుకోసం బూతు స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలని లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర కమిషనర్ డి హరిత, నెల్లూరు ఆర్డీవో మలోల తహసిల్దారులు వెంకటేశ్వర్లు నిర్మలానంద బాబా, బిఎల్వోలు పాల్గొన్నారు.

టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలి

నెల్లూరు : ప్రయివేటు విద్యాసంస్థలలో వరుసగా జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించే విధంగా టాస్క్ ఫోర్స్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ డిమాండ్ చేసింది.ఆ కమిటీ నిర్వాహకులు ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులు తల్లిదండ్రులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. విద్య హక్కు చట్టం 2009, నియమా, నిబంధనలను పాటించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

బిసి గర్జనను జయప్రదం చేయండి : మానుగుంట

ప్రజాశక్తి -కందుకూరు : వైసిపి జయహో బిసి గర్జన మహాసభను జయప్రదం చేయాలని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి బిసిలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బిసిలకు సంక్షేమ రంగంలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. బిసిలు అంటే వెనుకబడిన వర్గాలు కాదని, వైసిపికి వెన్నెముక లాంటి వారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 7న విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసిల కార్యక్రమానికి జనం భారీగా తరలిరావాలని కోరారు. ఇందుకు అవసరమైన విధి విధానాలను సంబంధిత బిసి ప్రతినిధులకు సూచించారు. బిసి నాయకులు నగళ్ళ నారయ్య, కుంభాల క్రాంతి కుమార్ ,ఆవుల మాధవరావు, జాజుల కోటేశ్వరరావు, చీమల వెంకట రాజా, కొచ్చర్ల కొండయ్య, వైసిపి నేతలు పరిటాల వీరాస్వామి, హనుమాన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి

లింగసముద్రం ఎపిఎంగా సింహాద్రి

ప్రజాశక్తి-లింగసముద్రం : లింగసముద్రం ఎపిఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎపిఎం గతంలో బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి కార్యాల యంలో పని చేస్తున్న సిసి ఇన్‌ఛార్జ్ ఎపిఎంగా ఉన్నారు. దీంతో ఉన్నతాధి కారులు నెల్లూరు డిఆర్‌డిఎలో పనిచేస్తున్న సింహాద్రిరావును ఎపిఎంగా బదిలీ చేయడంతో శనివారం ఆయన విధుల్లో చేరారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పొదుపు గ్రూపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేలా పని చేస్తానని తెలిపారు.

ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి- నెల్లూరు : సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల శతజయంతిని పురస్కరించుకొని నగరంలోని కస్తూరిబా కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి ఘంటసాల అభిమానులు, పలువురు ప్రముఖులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఘంటసాల అభిమాని కోడూరు ఆనందరావు అధ్యక్షతన నిర్వహించారు. పలువురు కళాకారులు సంగీతంలో ఘంటసాల ఖ్యాతిని కొని యాడారు. ఘంటసాల శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నీలకంఠం శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన ఈనెల 11వ తేదీన టౌన్ హాలులో నిర్వహించనున్న ఘంటసాల శతజయంతోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఘంటసాల అభిమాన గాయని గాయకులచే సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ సినీ ఆర్టిస్ట్ సింగంశెట్టి మురళీమోహన్, సీనియర్ గాయకులు ఆకుతోట రమణయ్య, రాయప్ప, పెంచల్ రెడ్డి, రామచంద్ర రావు కంభంపాటి లక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎను కలిసిన కనకారావు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గ వైసిపి పరిశీలకులుగా నియమితులైన మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు ఎంఎల్ఎ మహీధర్ రెడ్డిని ఆదివారం కలిసి పుష్పగుచ్చం అందించారు. వారు నియోజక వర్గంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పై చర్చించారు. 7న విజయ వాడలో జరిగే బి.సి గర్జన సభ విజయవంతానికి తీసు కోవాల్సిన విషయాలు చర్చించారు. న్యాయవాది ముప్ప వరపు. కిషోర్, సోషల్ మీడియా కో కన్వీనర్ ఆలూరి రవి ,గంధం సన్నీ ఉన్నారు.

ఎంఎల్‌ఎకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కనకారావు

రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి -కందుకూరు : మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కొణిజేటి రోశయ్య ప్రథమ వర్ధంతి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కొణిజేటి రోశయ్య చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదెళ్ల వేణుగోపాలరావు మాట్లాడుతూ అపరచానిక్యుడు మాజీ ముఖ్య మంత్రి కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలు ఎనలేనివి అన్నారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మీడియా ఛైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ రాజ కీయ నాయకులకు ఆయన ఆదర్శం అన్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కోటా నరసింహం, కోశాధికారి కనుమర్లపూడి మురళి, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి మోదడుగు వెంకటేశ్వర్లు, కందు కూరు మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు కాకుమాని వాసు, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ మురారి శెట్టి, వెంకట సుబ్బారావు, ఆర్యవైశ్య నాయకులు ఇస్కాల మధు, గుర్రం అల్లూరయ్య, సేగు శేషారావు, కె ప్రవీణ్ కుమార్, కొత్త ప్రసాదు, బోణాల సత్యం, ఇన్నమూరి శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, ఎం స్వామి, తాతా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోశయ్య చిత్రపటానికి నివాళిఅర్పిస్తున్న దృశ్యం

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి : ఆవాజ్

ప్రజాశక్తి-నెల్లూరు

రూరల్ నియోజకవర్గ పరిధిలోని అపరిష్కృతంగా ఉన్న మైనార్టీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం రూరల్ 29వ డివిజన్ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్ వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ అహ్మద్ మాట్లాడుతూ రూరల్ పరిధిలో ముస్లిం మైనారిటీల కోసం షాది మంజీలను వెంటనే నిర్మించాలన్నారు. అక్కచెరువుపాడు వద్ద ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాలను అసంపూర్తిగా వదిలివేసి ఉన్నారని దాని పనులను పూర్తి చేసి వెంటనే వాడుకులోకి తీసుకురావాలని కొరారు. రూరల్ పరిధిలో అనేక ఏరియాలలో ముస్లిం మైనారిటీల కబరస్థాన్లో ఆక్రమణలకు గురవుతున్నా యన్నారు. ముస్లింల కభరస్థాన్లలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నిరుపేద ముస్లింలకు ప్రభుత్వం మైనారిటీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాలను ఇవ్వాలని కోరారు. ముస్లిం మైనారిటీ విద్యార్థుల స్కాలర్షిప్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని వెంటనే స్కాలర్షిప్ లను తిరిగి అందజేయాల న్నారు. అనంతరం 11 మందితో ఆవాజ్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులుగా సయ్యద్ అన్వర్ ,షేక్ రోషన్లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆవాజ్ జిల్లా నాయకులు ఎస్ఎం భాషా , షేక్ గౌస్ పీర్ ,సయ్యద్ మీరా , రూరల్ ఆవాజ్ నాయకులు మొహమ్మద్సా భాయ్, శానవాజ్ అన్వర్ గౌస్ బాషా, కాలేశా తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఆవాజ్ నాయకులు

50 ఏళ్లు దాటితే 'బిఎండి' పరీక్షలు చేయించుకోవాలి

డాక్టర్ పి.నరేంద్రరెడ్డి, కీళ్లు, ఎముకల స్పెషలిస్టు

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ పి.పెంచలమ్మ 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని డాక్టర్ పెంచలమ్మ వైద్యశాలలో ఆమె కుమారుడు డాక్టర్ పి.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నుపూస, మదుమేహం, గైనిక్, దంత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.నరేంద్రరెడ్డి మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన తల్లి చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని వైద్యవృత్తిని స్వీకరించామన్నారు. తన తల్లి జ్ఞాపకార్థంగా రూ.1500లు విలువ చేసే బిఎండి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ఎక్స్ కిరణాలను ఉపయోగించి ఎముకలు బలంగా ఉన్నాయా లేదా గుర్తించగలుగుతామన్నారు. ఎముకల్లో క్యాలిషయం ఎంత మేరకు ఉంది.. ఇతర ఖనిజాలు ఎంత శాతం ఉన్నాయెూ గుర్తించ వచ్చన్నారు. సహజ ంగా ఉండాల్సిన శాతం కంటే అధికంగా ఉన్నప్పటికీ ఎముకల సమస్య రాదని, తక్కువ ఉండటం వల్ల ఎముకలు విరిగిపోవడం వంటి అనర్థాలు సంభవిస్తాయన్నారు. కీళ్ల నొప్పులు, చక్కెర వ్యాధి సమస్యలతో బాధపడుతున్నవారు ఈ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే 50 సంవత్సరాలు దాటిన పురుషులు, 60 సంవత్సరాలు దాటిన మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఎముకలు బలంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు. చిన్నచిన్న దెబ్బలకు ఎముకలు విరగటం, ఎక్కువ సమయంపాటు పనిచేయలేకపోవటం, కీళ్ళు, మోకాళ్ళ నొప్పులు తదితర సమస్యలతో బాధపడాల్సి ఉంటుందన్నారు. సహజంగా ఎముకల బలానికి కాల్షియం ఒక్కటే సరిపోతుందని చాలా మంది అనుకుంటారన్నారు. వాస్తవాని కాల్షియంతోపాటు ఇతర పోషకాలు ఎముకలకు అవసరం అన్నారు. ఎముకల పటుత్వానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు చేపలు, పాలు, పుట్టగొడుగులు, గుడ్డు, మాంసం, పన్నీర్ వంటి వాటిల్లో లభిస్తా యన్నారు. మెనోపాజ్ సమస్యతో బాదపడుతున్న మహిళల్లో ఎముకల సమస్య ఎక్కువగా ఉంటుం దన్నారు. విటమిన్ ఎ ఎముక దంతాల బలాన్ని మెరుగు పరచ డంలో సహాయప డటానికి ఆస్టియోబ్లాస్టలను (ఎముక-నిర్మాణ కణాలు) ఆస్టియోక్లాస్టలను (ఎముక విచ్ఛిన్నం చేసే కణాలు) ప్రభావితం చేస్తుంద న్నారు. విటమిన్ ఎ సమద్ధిగా ఉండే ఆహారాలు చిల గడదుంప, గొడ్డు మాంసం కాలేయం, బచ్చలికూర, క్యారెట్లు, సీతాఫలం, మామిడి, బలవర్ధకమైన ఆహారాలు గుడ్లు. వీటిని తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుందన్నారు.

పరీక్షలు చేస్తున్న దృశ్యం

'నక్షత్ర' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి నెల్లూరు : నగరంలోని నక్షత్ర స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ రూరల్ కమిటీలు డిమాండ్ చేశాయి. ఆదివారం ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ అధ్యక్షులు సుకుమార్ డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి కండె కోటేశ్వరరావు ఇక్కడ మాట్లాడారు. ఓవెల్ స్కూల్లో జరిగిన ఘటన మరవక ముందే నక్షత్ర స్కూల్లో బాలికపై లైంగిక వేధింపులు జరగడం బాధాకరమన్నారు. గుర్తింపు లేని కార్పొరేట్ స్కూళ్లు నగరంలో అనేకం ఉన్నాయని వీటన్నిటిమీద డిఇఒ జరిపాలని, గుర్తింపు లేనివాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలోని దేవాలయాల వద్ద చలితో బాధపడుతున్న పేదలకు ఆదివారం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. 1973-74 కందుకూరు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఫ్రెంచ్ అసోసియేషన్ గా ఏర్పడి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం దాదాపు 20 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. మంచిరాజు మురళీమోహన్, ఎం ఉమామహేశ్వరరావు, కాళిదాసు సత్యనారాయణ (ప్రభు), ఏకాంబరం, సత్యనారాయణ, దోనెపల్లి రమేష్, కాళిదాసు శ్రీ హర్ష ఉన్నారు.

టిడిపి క్యాడర్‌లో ఉత్సాహం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు మహాలక్ష్మిపురంలో ఈ నెల 3వ తేదీ "ఇదేమి ఖర్మ" సర్వేపల్లి నియోజకవర్గ అక్వా రైతుల సదస్సు జరిగింది. స్థానిక టిడిపి నాయకులు వీరబోయిన గంగాధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో మాజీ మంత్రి చంద్రమోహన్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బీదా రవిచంద్ర, కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కందుకూరు మాజీ ఎమ్మెల్యే శివరామ కష్ణయ్య, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమం క్యాడర్‌లో ఉత్సాహం నింపిందని ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తైక్వాండో పోటీల్లో 'గోనుగుంట' బ్రదర్స్ విశేష ప్రతిభ

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి) కుమారులు తైక్వాండో క్రీడలో రాణిస్తున్నారు. గత ఆరేళ గా గోనుగుంట జాషువా, గోనుగుంట మోజస్ మనోహర్, గోనుగుంట వరుణ్ చౌదరిల్లు క్రీడలో శిక్షణ పొందుతున్నారు. తండ్రి గోనుగుంట వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో తన ముగ్గురు కుమారులు సలాం మాస్టర్ వద్ద తైక్వాండోలో శిక్షణ పొందుతున్నారు. గత నెల 25,26,27 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు జరిగాయి. వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలో అన్నదమ్ములైన జాషువా, మోజస్ మనోహర్ ,వరుణ్ చౌదరిలు పోటీలో చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసు కున్నారు. గతం లోనూ ఈ ముగ్గురు పతకాలు సాధిం చారు. బంగారు పతకాలు సాధించిన గోనుగుంట బ్రదర్స్‌ని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి, తైక్వాండో అధ్యక్షులు ఉన్నం వీరస్వామి తోపాటు పలువురు అభినందించారు. వీరు ముగ్గురు స్థానిక ఆక్స్ఫర్డ్ స్కూల్లో చదువుతున్నారు.

బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులతో తండ్రి గోనుగుంట వెంకటేశ్వర్లు

బంగారు పతకం సాధించిన వరుణ్ చౌదరిని అభినందిస్తున్న మాస్టర్ సలాం..

పంట కాలువ ప్రారంభం

ప్రజాశక్తి -వెంకటాచలం : ఇడిమేపల్లి, జంగాలపల్లి రైతుల దశాబ్దాల కలను నెరవేర్చడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడిమేపల్లిలో కనుపూరు కాలువ నుంచి ఇడిమేపల్లి చెరువుకు సాగునీరందించే పంట కాలువను స్థానిక రైతులు, అధికారులతో కలిసి మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు ఐదారు దశాబ్దాలుగా ఇడిమేపల్లి, జంగాలపల్లి రైతులు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులు బాధలు వర్ణనాతీతమన్నారు. సర్వేపల్లి, కనుపూరు కాలువల ద్వారా ఇడిమేపల్లి చెరువుకు సాగునీరు అంది రెండు పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. తహశీల్దార్ నాగరాజు, సర్పంచ్ ఉప్పు యశస్విని,, ఎంపీటీసీ రాపూర్ అంకయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ జెడ్పిటిసి మందల వెంకట శేషయ్య, ఉప ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఈదగాలి ఎంపీటీసీ రఘునందన్ రెడ్డి, ఉప్పు బూపయ్య మల్లికార్జున్ రావు, నెల్లూరు శీనయ్య, పాళెపు పాపయ్య పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కమిషనర్ హరిత ఆకాంక్షించారు. నేడు కార్యాలయంలో జరిగే స్పందన వేదికలో సమస్యల పరిష్కారం కోసం 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో భాగంగా ఉదయం 9:30 నుంచి 10:30 వరకు 0861-2355678 నెంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

ఆర్ఒ ప్లాంట్ వితరణ

ప్రజాశక్తి -పొదలకూరు : డిఎన్ఆర్ జెడ్‌పి హైస్కూల్లో 1992 - 93లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఇదే స్కూల్ ప్రాంగణంలో ఉన్న బిసి బాలి కల హాస్టల్‌కు రూ. 50,000 విలువ చేసే కమర్షియల్ మినరల్ వాటర్ ఆర్.ఓ ప్లాంటు ను ఆదివారం అందించారు. విద్యార్థినులు గత కొంత కా లంగా త్రాగటానికి మినరల్ వాటర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థులు దేవరం వినోద్ కుమార్, ఉప్పాల సాగర్, ముని శంకర్, సంతోష్ కుమార్ ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ను హాస్టల్ వార్డెన్స్ చైతన్య, సుధారాణి కి అందజేశారు. హాస్టల్ విద్యార్థులు, వార్డెన్లు ప్రత్యేక అబి. నందనలు తెలిపారు. పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు. శేషు,సురేష్ పాల్గొన్నారు.

కొనసాగిన 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి -వెంకటాచలం : ప్రజలకు ఇచ్చిన హామీలను మాట తప్పకుండా ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో పర్యటించారు. మంత్రికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూడిపర్తి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు అభివద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. తహశీల్దార్ నాగరాజు, సర్పంచ్ శ్రావణి, ఎంపీటీసీ రఘునాథ్ రెడ్డి, ఈదగాలి ఎం పి టి సి రఘునందన రెడ్డి ఉన్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి -వెంకటాచలం : మండలంలోని కసుమూరు గ్రామంలో యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్న సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు కసు మూరుకు చెందిన మస్తాన్ బేబీ (18) కి తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని కలత చెందింది. దీంతో ఇంట్లో ఎవరు లేని సమ యంలో ఉరి వేసికొని మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి -ఉలవపాడు : కరేడులో ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా రాహుకేతుల, కాలభైరవుస్వామి, సుబ్రహ్మణ్యం స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : అంకమ్మ తల్లి దేవాలయం పునర్నిర్మాణ పనులు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శరవేగంగా సాగుతున్నాయి. శ్రీ అంకమ్మ తల్లి పాదాల చెంత ప్రతిష్టింపచేసే స్వర్ణ యంత్రానికి జాజుల బాలకష్ణ భార్య, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జాజుల లావణ్య రూ.5,116 ఆలయ ప్రాంగణంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ పునర్ నిర్మాణ కమిటీ సభ్యులు ఆవుల మాధవరావు, మాదాల మాల్యాద్రి, మాలకొండయ్య ఉన్నారు.

నిందితురాలు అరెస్ట్

ప్రజాశక్తి-ఉదయగిరి : సర్కిల్ పరిధిలోని సీతారాంపురం పోలీస్ స్టేషన్‌లో నవంబర్‌లో జరిగిన హత్య కేసు నిందితురాలిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారని కావలి డిఎస్‌పి ఎం.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిందితురాలు మెహరున్నీసా భర్త అక్బర్‌తో కలిసి చీరాల వ్యాపారం కూలి పనులు చేసుకుని ఇద్దరు పిల్లలతో జీవనాన్ని సాగించేవారని తెలిపారు. మృతుడు ఆంబోరు సుబ్బారావు గతంలో కూరగాయలు అమ్ముతూ ఖాళీగా ఉన్నాడని తెలిపారు. కడప జిల్లా కాశీనాయన మండలం గ్రామానికి చెందిన మృతుడు నిందితురాలికి పరిచయం ఏర్పడి కొంతకాలంగా సహజీవనం చేశారన్నారు. నిందితురాలు భర్తకు ఇరువురి సంబంధం తెలియడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని మళ్లీ వస్తాడని భయంతో నిందితురాలు మృతుడికి లక్ష రూపాయలు ఇస్తాను తన భర్త పీడా వదిలించాలని నిందితురాలు మృతుడు సుబ్బారావుని కోరగా ఇప్పటివరకు అక్బర్ ఆచూకీ తెలియలేదని ఆమె తెలిపారు. తరువాత నిందితురాలితో పెళ్లి చేసుకుందాం బిడ్డలను వదిలేసి వచ్చేయాలని మృతుడు కొట్టి హింసించేవాడని తెలిపారు. మృతుడే ఏదో చేసి ఉంటాడని అనుమానంతో మృతుడు నిందితురాలు ఇద్దరు కలిసి కడప జిల్లా పోరుమామిళ్ల నుంచి స్కూటీపై గత నెల 26న బయల్దేరి సీతారాంపురంకు నిందితురాలు మోడల్ స్కూల్ సమీపంలో ఇంటికి వచ్చారని తెలిపారు. ఇరువురి మధ్య గొడవ జరిగిందన్నారు. అనంతరం సుబ్బారావు తనకు రావాల్సిన డబ్బును ఇవ్వాలని కొట్టి హింసించేవాడని నిందితురాలు తెలిపిందన్నారు. అంతేకాకుండా తన కూతురిపై అసభ్యకర పదజాలంతో మానసికంగా, అవమానంగా మాట్లాడడం నిందితురాలిని మృతుడు డబ్బుల కోసం బాగా ఒత్తిడి చేసేవాడన్నారు. మృతుడు సుబ్బారావుని ఎలాగైనా వదిలించుకోవాలని నవంబర్ 26న రాత్రి రెండుసార్లు డోలో 650 మాత్రలు 23 మింగించి అనంతరం రాత్రి 10 గంటల సమయంలో 10 నిద్ర మాత్రలు నీటిలో కలిపి తాగించానని నిందితురాలు తెలిపిందన్నారు. అనంతరం కొట్టిచంపి స్కూటీతో సహా పెట్రోల్ పోసి తగలబెట్టానని నిందితురాలు తెలిపిందన్నారు. శవం పూర్తిగా తగలబడే వరకు అక్కడే ఉండి, నిందితురాలు తెచ్చుకున్న చెక్కతో ముత్తుడిని కొట్టిందన్నారు. అదే సమయంలో మృతుడి సెల్‌ఫోన్, రూ.37 వేల నగదును తీసుకొని పారిపోయిందన్నారు. మృతుడి భార్య ఆంబోరు వెంకటలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయి మెహరున్నీసాను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. సిఐ గిరిబాబు తమ సిబ్బందితో ప్రత్యేక బందాల ఏర్పాటు చేసి చాకచక్యంగా కేసును తక్కువ సమయంలో చదివించినందుకు అభినందించారు. కార్యక్రమంలో సీతారాంపురం ఎస్‌ఐ కిషోర్, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం ఎస్‌వి పాలెం గిరిజన కాలనీలో ఆదివారం కాండ్ర సతీష్ నాయుడు దాతృత్వంతో 230 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబరు మాలకొండారెడ్డి పాల్గొని మాట్లాడుతూ గిరిజనులు తన పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని దాని ద్వారా పేదరికం నుండి బయట పడవచ్చన్నారు. భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ సింహాద్రి రావు మాట్లాడుతూ కాండ్ర సతీష్‌నాయుడు చలికాలంలో నిరుపేదలను గుర్తించి దుప్పట్లు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. గ్రామ్స్ గిరిజన జాగృతి వేదిక ప్రధాన కార్యదర్శి బావిశెట్టి వెంకటయ్య మాట్లాడుతూ గిరిజనులకు ఇంకా సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వారికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాక తిరుపతయ్య, జయపు కనకయ్య, పీట్ల ప్రతాప్, ఆన్యం రామయ్య, పచ్చిపాల పెంచలయ్య, ఇష్టాలి చెంచురెడ్డి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలో కర్నూలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : వికేంద్రీకరణ మద్దతుగా రాయలసీమలో హైకోర్టు కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 6వ తేదీన నిర్వహించనున్న ఛలో కర్నూలు రాయలసీమ గర్జన విజయవంతం చేయాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. ఆత్మకూరు వైసిపి ఆదేశాల మేరకు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో ఆదివారం ఆత్మకూరులోని క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, జిమ్ము, నందవరం ప్రతాప్, చైతన్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాలెం మండలంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా ఓటు నమోదు చేసుకునేందుకు ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ డేను ఏర్పాటు చేశారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ బుచ్చి డి.ఎల్.ఎన్.ఆర్ పాఠశాలలో పోలింగ్ బూతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం మండలంలో మొత్తం 78 పోలింగ్ బూతులు ఉన్నాయని ప్రతిప్రతి బూత్‌లో బిఎల్‌ఒలు ఫారం 6, 7, 8, 8ఎ లను తీసుకుంటారని, ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకొని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనవెంట తహశీల్దార్ ప్రమీల, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

మొక్కలు నాటడం అభినందనీయం

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సాయిబాబాగుడి వద్ద నూతనంగా ప్రారంభించబోతున్న శ్రీ వాల్మీకి యోగా కేంద్రంలో 41 మొక్కలు నాటడం అభినందనీయమని యోగా కేంద్రం గురువులు డాక్టర్ టి.జయలక్ష్మి, డాక్టర్ టి.మాధవిలత, డాక్టర్.కె.ఆనంద్ కుమార్, పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.మాధవిలత మాట్లాడుతూ సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఒక సంవత్సరంలో 1000 మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనే నినాదంతో మొదలైన కార్యక్రమం ద్వారా నేటికి 955 మొక్కలు నాటడం పూర్తయిన సందర్భంగా సురేంద్రను అభినందిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సంయుక్త సేవాసంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సురేంద్రకు సపోర్ట్ ఇస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

నేడు పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి-కావలి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కావలి తాలూకా కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10గంటలకు జరుగుతుందని సంఘం అధ్యక్షులు ఆకుల రమణయ్య ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సంఘ 2021-22 ఆర్థిక సంవత్సర జమా, ఖర్చుల ఆమోదం, గత సంవత్సర కాలంలో సంఘం చేపట్టిన కార్యక్రమాల సమీక్ష జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రానున్న 3సంవత్సరాల కాలానికి నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. కావున ఈ సమావేశానికి సంఘ సభ్యులు పెన్షనర్లందరూ హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు.

దండిగుంటలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-విడవలూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని దండిగుంట గ్రామంలో ప్రతి గడపకు తిరుగుతూ వారికి అందిన సంక్షేమ పథకాలు గురించి కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకే పాలన అంటూ వాలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వారి సమస్యలను తీరుస్తున్నారన్నారు. అయితే కొంతమంది బాదుడే-బాదుడు కొత్త పేర్లు పెట్టి నైతిక విలువలు కోల్పోయేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్ తల్లికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ తరపున రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, కోటంరెడ్డి నవీన్ రెడ్డి, పుండ్ల అచ్యుత్‌రెడ్డి, కొండూరు వెంకట సుబ్బారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ, రామిరెడ్డి విజయభానురెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం కోసం ఎదురుచూపు..



ప్రజాశక్తి-ఉదయగిరి : విష సర్పం (రక్తపింజర) కాటుకు గురై మంచం పట్టిన బత్తుల నాగరాజు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు చూస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్రపల్లి బిసి కాలనీలో ఎం.ఎ బి.ఇడి చదువుకున్న నిరిద్యోగి బత్తల నాగరాజు తన బాధలను తెలుపుతూ తనకు సాయం చేయాలని కోరాడు. తనకు ఉద్యోగం రాక కాశీనాయన సెంటర్‌లో చిన్న బొంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపాడు. అక్టోబర్ 24 దీపావళి రోజున బంకులో కూర్చుని ఉండగా రక్తపింజరనే విష సర్పం కుట్టగా దీంతో కాలు పాదం మొత్తం ఇన్ఫెక్షన్ వచ్చి రెండుసార్లు ఆపరేషన్ చేశారని తెలిపారు. ఇందుకోసం రూ.70,000 ఖర్చయిందన్నారు. అప్పటి నుండి నడవలేక మంచానికి పరిమితమయ్యానని తెలిపారు. రోజుకు కాలు కట్టుకు రూ.300 నుండి రూ.350 ఖర్చు అవుతుందన్నారు. ఇలా ఇంకా చేయాలని డాక్టర్లు చెబుతున్నారని తెలిపారు. కానీ దీంతో సరాసరి రెండు నెలల నుండి ఉపాధి కల్పించే బొంకు మూతపడడంతో కుటుంబ జీవనం గడవడక చాలా కష్టమైందని తెలిపారు. కావున ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి ధైర్యం అండగా నిలవాలని కోరాడు.

వైకల్యాన్ని అధిగమించేందుకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు

పిల్లల్లో వైకల్య సమస్యలను ఆరంభ దశలోనే గుర్తించి వైద్యనిపుణుల ఆధ్వర్యంలో చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథకం సమన్వయకర్త సిహెచ్ ఉషారాణి పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం సులువైతుందన్న ఆలోచనతో సమగ్ర శిక్ష చైర్మన్, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో 'వైకల్య నిర్ధారిత వైద్య శిబిరం' జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాలు జిల్లాలో ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు, ఎటువంటి వైద్య సేవలందిస్తున్నారో ఆమె మాటల్లోనే ..

ప్రశ్న. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వైకల్య నిర్ధారిత వైద్య శిబిరంలో ఏయే అనారోగ్య సమస్యలకు వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహిస్తారు. ఏ వయస్సు నుంచి ఏ వయస్సు పిల్లలకు ఈ శిబిరంలో డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారు..?

జవాబు. దర్గామిట్ట ప్రాంతంలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం (నేడు) ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నాం. ఈ శిబిరాన్ని కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ వైద్యశిబిరంలో 3 సంవత్సరాల వయస్సు కలిగిన వారి నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలందరికీ డాక్టర్లు పరీక్షలు చేస్తారు. అంగవైకల్యం, మరగుజ్జుతనం, చెవిటి, కంటి సమస్యలు, గ్రహణమొర్రి, శూల, అల్జీమర్స్, పక్షవాతం, మస్తిష్క పక్షవాతం, మానసిక వైకల్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ఈ శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించుకోవచ్చు.

ప్రశ్న. ఈ వైద్యశిబిరం ఒక్క నగరంలోనే ఏర్పాటు చేస్తున్నారా.. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారా.. పలు ప్రాంతాల్లో ఈ వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తుంటే ఏయే తేదీల్లో ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు..?

జవాబు. జిల్లాలో మొత్తం ఆరు ప్రాంతాల్లో ఈ వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. నేడు నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలోని జెడ్‌పి బాలికల పాఠశాలలో, 6వ తేదీన ఆత్మకూరు, 7వ తేదీన వింజమూరు, 8వ తేదీన పొద లకూరు,



9వ తేదీన కందుకూరు, 10వ తేదీన కావలిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ వైద్య శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రశ్న. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైకల్య నిర్ధారిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న పిల్లలకు అవసరమైతే పరికరాలు ఏమైనా పంపిణీ చేస్తారా..?

జవాబు. జిల్లాలో ప్రభుత్వం ఆరు ప్రాంతాల్లో ఈ వైద్యశిబిరాలు వేరు వేరు తేదీలల్లో నిర్వహిస్తుంది. ఈ శిబిరానికి హాజరై డాక్టర్లు పరీక్షలు నిర్వహించిన తరువాత వైకల్యం నిర్ధారణ అయిన తరువాత ఎవరికైతే పరికరాలు అవసరం అవుతాయో వారు పేర్లు నమోదు చేసుకోవాలి. పేర్లు నమోదు చేసుకున్న వారికి పరికరాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. అంగవైకల్యంతో బాధపడుతున్న పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలి.

ప్రశ్న. పిల్లల్లో ముందస్తు లోపాలను గుర్తించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంది. సర్వశిక్ష పథకం కింద ఎటువంటి సేవలు చేస్తున్నారు..?

జవాబు. పిల్లల్లో ముందస్తుగా లోపాలను గుర్తించేందుకు జిజిహెచ్‌లో ఒక ప్రత్యేక విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో పిల్లలకు వైద్య పరీక్షలు చేసేందుకు నిపుణులైన వైద్యులతోపాటు ఆడియో మెటాలజిస్టు, ఫిజియో థెరపిస్టు, స్పీచ్ థెరపిస్టులు అందుబాటులో ఉన్నారు. ఇక సర్వశిక్షా పథకం కింద ప్రత్యేక అవసరాలను, ఉపకార వేతనాలు, రవాణా, బ్రిడ్జి స్కూల్ నిర్వహణ, పిల్లలకు పౌష్టికాహారం అందజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాం.

సమగ్ర శిక్ష అదనపు పథకం సమన్వయకర్త సిహెచ్ ఉషారాణి

ఇంటర్వ్యూ

వైద్య సేవలందిస్తున్న ఎం.వి రమణయ్య

తక్కువ ఖర్చుతో వైద్యం : జెవివి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం వారి సహకారంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి తక్కువ ఖర్చుతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ ప్రాంగణంలో వైద్య శిబిరం డాక్టర్ ఎం.వి. రమణయ్య, డాక్టర్ అహన్ ఆధ్వర్యంలో షుగర్, బిపి పేషెంట్లకు వైద్య పరీక్షలు చేసి వారికి మందులు అందజేశారన్నారు. పలు ప్రాంతాల నుండి ఉదయం 7 గంటలకే షుగర్ వ్యాధి ఉన్న వారు వచ్చి షుగర్ పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంవి రమణయ్య మాట్లాడుతూ షుగర్ టెస్ట్ రూ.25, ఇన్సులిన్ ఒకటి రూ.80 రెండు నెలలకు అవసరమయ్యే మందులు కేవలం రూ.200 మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరం పేదలకు చాలా తక్కువతో కూడిన వైద్యం అందిస్తున్నట్లు, ఈ వైద్యాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎల్‌కె కృష్ణ ప్రసాద్, సాదిక్ హుస్సేన్, మల్లికార్జున, వేము పెంచలయ్య, డేగా సుబ్బారావు, కరుణాకర్, తదితరులున్నారు.

ఆటో కార్మికుల సమావేశం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని ఇందుకూరుపేట సిపిఎం కార్యాలయంలో మండల సిఐటియు అధ్యక్షులు ఎస్.కె.చాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఆటో కార్మికులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు మారుబోయిన రాజా పాల్గొని మాట్లాడారు. ఆటో కార్మికులు సభ్యత నమోదు చేసుకుని ఉన్నత విలువలతో ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు ఆటో కార్మికులు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో 6వ మైలు ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకయ్య, నరసింహ, మల్లి, డీజే మల్లి, తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని ఇరువూరు గ్రామంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బస్సు రవాణా సదుపాయం లేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. చుట్టుపక్కల గ్రామాలైన కొండయ్యపాలెం, కృష్ణంరాజుపల్లి, గొల్లపల్లి, మహమ్మదాపురం గ్రామాల నుండి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువు విద్యార్థులు దాదాపు 30 మంది విద్యార్థులు ఇరువూరు ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరు స్కూల్‌కి వెళ్లటానికి ఎలాంటి రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల ఆ రూట్‌లలో వచ్చే టూవీలర్‌నే కానీ ఆటోలను కానీ బతిమిలాడుకొని వాటిలలో ఎక్కి స్కూలుకు వస్తుంటారు. కానీ సాయంత్రం స్కూలు వదిలిన తర్వాత ఇళ్లకు చేరటానికి వారికి ఎటువంటి రవాణా సదుపాయం లేక దాదాపు చీకటి పడే వరకు ఇరువురు స్కూల్ దగ్గరే రోడ్డు మీదనే ఎదురుచూస్తూ ఉంటూ ఉంటారు. గండిపాలెం నుండి గొల్లపల్లి మీదుగా పామూరు వెళ్లడానికి ఎటువంటి బస్సు సౌకర్యం లేదు కనుక ఆ రూట్‌లో వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంపాదన ఆదాయంగా చూసుకునే ఆర్‌టిసి అలాకాకుండా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గండిపాలెం నుండి ఎర్రవరెడ్డిపల్లి, గొల్లపల్లి, మహమ్మదాపురం మీదుగా బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులకు తగిన సౌకర్యం కల్పించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్మిక చట్టాలపై కేంద్రం ఉక్కుపాదం : సిఐటియు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న పి.అజయ్‌కుమార్

స్వాతంత్ర్యానంతరం కార్మిక సంక్షేమమే ధ్యేయంగా రూపొందించుకొన్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తిరగరాసిందని, బ్రిటీష్ కాలంనాటి అమానవీయ విధానాలను, బానిస చట్టాలను మళ్లీ తెరమీదకు తెస్తుందని, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సిఐటియు జిల్లా మహాసభ సందర్భంగా లేబర్ కోడ్లు - కార్మికులు ఉద్యోగులపై ప్రభావం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా పి.అజయ్ కుమార్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడి చేయడానికి సిద్ధపడుతుందని అందుకని కష్టపడి పోరాడు సాధించుకున్న హక్కుల రూపంలో ఉన్న చట్టాలు ఏవైతే ఉన్నాయో మోడీ ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడి చేయడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ లేబర్ కోడ్స్ 29 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా చట్టాలను రూపొందించినట్లు తెలిపారు. ఈ చట్టాలు కుదించడంతో కొన్ని హక్కులకు ప్రమాదంలో పడ్డాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మనం ఏదో ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్నామనుకోవడం పొరపాటు అని అన్నారు. కార్మికుల హక్కుల కోసం, జీతం పెంపదల కోసం ప్రతి ఐదు సంవత్సరాలకు జీతాల ప్రమోషన్లు, అలవెన్స్‌లు ఇవన్నీ ఉండాలన్నారు. అదే సమయంలో శ్రమ వల్లే సంపద వస్తుందని తెలిపారు. అదే శ్రమ చేసిన వాళ్లకి దక్కకుండా కూర్చున్న వాళ్లకి సంపద దక్కుతుందని ఇటువంటి సమయంలో కార్మికులకు కొన్ని చట్టాలు హక్కులు ఉన్నాయన్నారు. యజమానితో ప్రభుత్వంతో బేరసారాలు చేసుకునే హక్కు ఉందని తెలిపారు. యూనియన్లు పెట్టుకునే హక్కు, మీటింగ్లు పెట్టుకునే హక్కు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులే అని తెలియజేశారు. కార్మికులు బ్రిటీష్ పాలన కాలంలో కూడా పెద్ద ఎత్తున పోరాటం చేసి చట్టాలు సాధించుకున్నారన్నారు. పోరాటాలు కంట్రోల్ చేయడం కోసం చట్టాలు తెచ్చారని తెలిపారు. సమ్మె చేయాలంటే ముందుగా నోటీసులు ఇచ్చి చేయాలని చట్టాలను తీసుకువచ్చారన్నారు. దేశంలో పలు ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుపరం చేయాలని నిర్ణయించి, 149 మంది సంపన్నుల కోసం ఈ ప్రయివేటీకరణ కార్మికుల హక్కులపై ప్రభుత్వం పెద్ద ఎత్తున దాడి చేయడానికి సిద్ధపడుతుందని తెలిపారు. టిడిపి, వైసిపి, కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు సంపన్నుల ప్రభుత్వాలు పెద్దపెద్ద పెట్టుబడిదారులైన అదాని, అంబానీ పెట్టుబడిదారుల ప్రభుత్వాలు అని ఇటీవల మీడియా కథనాలలో చూశామన్నారు. ఇలా కార్మికులకు శ్రమ తప్ప ఫలితం ఉండదని, సంపన్నుల చేతుల్లోకి సంపద వెళుతుందన్నారు. కార్మికుల చట్టాల కోసం కార్మికులంతా ఏకమై హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండి సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి.వి.శివప్రసాద్, మండల అధ్యక్షులు ఆత్మకూరు నాగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, మండల అధ్యక్షులు కొండమూరి హజరత్తయ్య, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతు సంఘం ఆత్మకూరు మండలం ప్రధాన కార్యదర్శి ఎల్‌కె ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

యల్లాయపాళెంలో 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి-కొడవలూరు

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మండలంలోని యల్లాయపాళెం గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. గత మూడున్నర సంవత్సరాల నుండి ఈ రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయి అరాచక పాలన సాగుతుందని, మాఫియాలు రాజ్యం ఏలుతున్నా యని ఆరోపించారు. ఈ రాష్ట్రానికి పట్టిన ఖర్మ వదలాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, కోవూరు నియోజకవర్గంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శాసనసభ్యులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, ఎంపిటిసి గరికపాటి రాజేంద్ర, చెక్క మదన్, కేతు వెంకటరమణరెడ్డి, భూలోకం విజయ్, బడుగు శ్రీనివాసులు, షేక్ ఫయాజ్, జ్యోతి సుమన్, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌సిసి' ర్యాలీ

ప్రజాశక్తి-నెల్లూరు

51వ భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా ఆదివారం 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ కమాండింగ్ ఆఫీసర్ వినయ్ రామ చంద్రన్ ఆదేశాల మేరకు కెఎన్‌ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్ ప్రకాష్ రావు సహకారంతో సెకండ్ ఆఫీసర్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్ర బాబు ఆధ్వర్యంలో ఎన్‌సిసి కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బి.వి.నగర్‌లోని కెఎన్‌ఆర్ పాఠశాల నుంచి పొదలకూరు రోడ్డు, దర్గా మిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలోని ఎపి గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు కేడెట్లు పండ్లు బిస్కెట్, ప్యాకెట్ల పంపిణీ చేశారు. విద్యార్థులనుద్దేశించి గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ 1971లో భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో భారత నావికా దళం పాకిస్తాన్‌లోని కరాచి ఓడరేవుపై మెరుపుదాడి జరిపి, వారి ఆయుధాలను సర్వనాశనం చేసి భారత్ ఘన విజయానికి కారణమైన నేపథ్యంలో ప్రతి సంవత్సరం డిసెంబరు 4న భారత నావికా దళ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి కేడెట్లు, విద్యార్థులు, పిడి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న పోరాట కమిటీ సభ్యులు

చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ఇంకెంతకాలం తీసుకుంటారని, చుక్కల భూముల తొలగింపు తంతుకు సర్వే నెంబర్ 2008/2 చుక్కల భూములను జాబితా నుండి వెంటనే తొలగించాలని చుక్కల భూముల బాధితుల పోరాట కమిటీ పేర్కొంది. ఆదివారం ఉదయం 10 గంటలకు జనతాపేట ప్రభాకర్ కోచింగ్ సెంటర్ భవనంలో జనతాపేట 2008/2 సర్వే నెంబర్ చుక్కల భూముల బాధితుల పోరాట కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు. దాదాపు 40మంది సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 2018 నాటి ప్రభుత్వం 1954 నుండి కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతూ రిజిస్టర్ చేసుకున్న ఇళ్లు, ఇళ్ల స్థలాలను కూడా చుక్కల భూముల జాబితాలో చేర్చిందని ఐదారు నెలలుగా తాము ఎంఎల్‌ఎ, ఆర్‌డిఒ, తహశీల్దార్లను కలసి 'స్పందన'లో అర్జీలు ఇచ్చి తమ భూములను చుక్కల భూముల జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డి ఆర్ ఒ లను స్పందన కార్యక్రమాల్లో కలసి అర్జీలు ఇస్తున్నా.. వారు ఒకరి వద్ద ఫైలు ఉందని మరొకరు చెప్పడం జరుగుతున్నదే గానీ ఇంతవరకు 2008/2 సర్వే నెంబర్ ఇళ్ల స్థలాలు ఇళ్లను చుక్కల భూముల జాబితా నుండి తొలగించడం మాత్రం జరగలేదని తెలిపారు. 2007 సర్వే నెంబర్‌లోని చుక్కల భూములు కొన్నింటిని తొలగించారన్నారు. ఆ పని ఎట్లా జరిగిందో తెలియడం లేదని తెలిపారు. అక్టోబర్ 30న మంగళగిరిలో డి.ఆర్.ఒల సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో ప్రభుత్వం నవంబర్ 15 లోపు అన్ని చుక్కల భూములను జాబితా నుండి తొలగించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ప్రభుత్వమే జి.ఒ. ఇచ్చాక నెల రోజులు కావస్తున్నా, ఇంతవరకు అధికారులు పనులు చేపట్టలేదన్నారు. చుక్కల భూములను జాబితా నుండి తక్షణమే తొలగిస్తారా.. లేదా.. అని నిలదీసేందుకు సోమవారం పోరాట కమిటీ ర్యాలీగా వెళ్లి 'స్పందన'లో ఏకైక డిమాండ్‌ను అధికారుల ముందు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ కో కన్వీనర్లు సి.శారద, శ్రీనివాసులు, కోటేశ్వరి, చలపతిరావు, రాధాకృష్ణ, మల్లికార్జునరెడ్డి, మాల్యాద్రి, తదితర సభ్యులు పాల్గొన్నారు.

గాయకులకు సత్కారం

ప్రజాశక్తి-కావలి

బామా సంస్థ గౌరవ సలహాదారు డాక్టర్ మనోహర్ బాబు నివాసంలో శతాబ్ద గాయకుడు ఘంటసాల శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పలువురు గాయకులను సత్కరించారు. ఈ సందర్భంగా గాయకులు ఘంటసాల పాటలను శ్రోతలకు వినిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ బాబు కొన్ని ఘంటసాల పాటలను చాలా అద్భుతంగా ఆలపించారు. బామా సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహణ స్పాన్సర్ చేసిన డాక్టర్ మనోహర్ బాబుకి ఘంటశాల అభిమాన సంఘం అభినందనలు తెలియజేసింది.

సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్



మండలంలో చేపడుతున్న ఆయుష్మాన్ భారత్ సర్వేను యుద్ధ ప్రాతపదికన పూర్తి చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. ఆదివారం వెబ్‌ఎక్స్ ద్వారా ఎఎన్‌ఎంలతో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టరు సర్వే ప్రోగ్రెస్‌పై సీరియస్‌గా వున్నారని తెలిపారు. కావున అందరూ పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్‌ఎంలు, వాలంటీర్లు సహకారంతో త్వరగా సర్వే పూర్తి చేసి ఆత్మకూరు మండలాన్ని ముందంజలో ఉంచాలని ఎంపిడిఒ కోరారు.

పోలింగ్ కేంద్రాలలో జెసి పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నందవరంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను ఆదివారం జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ పరిశీలించారు. జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బూత్ లెవెల్ అధికారులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ఆర్‌డిఒ కరుణకుమారి, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్‌ఐ సురేంద్ర, విఆర్‌ఒ తిరుమల రావు, కార్యదర్శి రమేష్ ఉన్నారు.

బిఎల్‌ఒలకు సూచనలను అందజేస్తున్న కావలి ఆర్‌డిఒ శీనానాయక్

ప్రజాశక్తి-అల్లూరు : మండల కేంద్రంలోని రామ కృష్ణ జూనియర్ కళాశాలలో ఎన్నికలకు సంబంధించిన బూతులను ఆదివారం కావలి ఆర్‌డిఒ శీనానాయక్ పరిశీలించారు. అలాగే బూత్ లెవెలింగ్ అధికారులకు 6, 6బి, 7, 8 ఫారంల గురించి పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోవు పట్టభద్రులు, ఎంఎల్‌సి ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పలు జాగ్రత్తలు చేపట్టాలని కోరారు. ఆయా ఎన్నికలకు సంబంధించి భూతులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ చెంచయ్య, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తదితరులున్నారు.

కొనసాగుతున్న 'పవనన్న ప్రజాబాట'

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు సిటీ నియోజక వర్గంలో జనసేన నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్విరామంగా, నిరాటంకంగా జరుగుతున్న పవనన్న ప్రజాబాట ఆదివారం 202వ రోజుకు చేరింది. స్థానిక 43వ డివిజన్ కంషాద్ వలీ దర్గా ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజాసమస్యలను అధ్యయనం చేసి పోరాడతామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి గత ఎన్నికల ముందు ముస్లిం మైనారిటీలకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఆ హామీలను తుంగలో తొక్కిందని, మైనారిటీలకు ప్రభుత్వం నుండి అందాల్సిన పథకాలు, రుణాల నిధులు అందట్లేదని, వక్ఫ్‌బోర్డు ఆస్తులను కూడా నిర్వీర్యం చేశారని, ఆఖరికి చిన్న పిల్లలకు ప్రభుత్వం తరపున జరిపే ఖత్నా కార్యక్రమం కూడా జరపలేకపోయారని దుయ్యబట్టారు. ఉర్దూని రెండో అధికార భాషగా ప్రకటించి చేతులు దులుపుకొన్నారని, కానీ ప్రతి ప్రభుత్వ శాఖలో, ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ వార్డు సచివాలయాల్లో నియమించాల్సిన ఉర్దూ ట్రాన్సలేటర్లను నేటికీ నియమించలేదని, కనీసం ఆ దిశగా కసరత్తు కూడా ఈ ప్రభుత్వం ప్రారంభించలేదని తెలిపారు. ఈ అంశంలో కూడా ముస్లిములను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. నిజంగా ఈ ప్రభుత్వానికి ముస్లిం మైనారిటీల అభ్యున్నతిపై చిత్తశుద్ధి ఉంటే తక్షణం అన్ని ప్రభుత్వ శాఖలకు ప్రతి కార్యాలయంలో ఉర్దూ ట్రాన్సలేటర్ పోస్టులను విడుదల చేయాలని కేతంరెడ్డి వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులకు బహిరంగ వేలంపాట

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామ పంచాయితీ పరిధిలోని పెద్దచెరువు, చిన్నచెరువు, నల్లపాలెం చెరువు, ఆనాటికంద్రిక చెరువులకు సంబంధించి **ఫసలీ నెం.1432** చేపలు పట్టుకునే హక్కుకై వేలంపాట జరుగును. **తే09-12-2022ది (శుక్రవారం) మధ్యాహ్నం గం॥ 2.00 గం॥లకు** తాటిపర్తి గ్రామ పంచాయితీ కార్యాలయం నందు నిర్వహించబడునని తెలియజేయడమైనది. సదరు వేలంపాటకు గ్రామ సర్పంచ్ సమక్షంలో వేలంపాట నిర్వహించబడును. కావున ఈవేలంపాటలో పాల్గొనే వారు ఎవ్వరైనా పంచాయితీ వారు నిర్ణయించిన రుసుమును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చును.

ఇట్లు
తాటిపర్తి గ్రామ పంచాయితీ కార్యాలయం
పొదలకూరు మండలం
సెల్: **70320 41851, 79813 17343**